# ఇల్లు అద్దెకు ఇవ్వబడును

'సత్యం, ఈవారంపత్రికలో కథలు వుండేట్లు లేదు—మంచికథలు రాలేదు. నీవు ఒక కథానిక వ్రాసి యివ్వు' అని అడిగాడు 'శారద' సంపాదకుడు ఆరోజు సాయంత్రం క్లబ్బుకు వెళ్ళేప్పుడు దారిలో కలిసి. సరే, అలాగేలే అని అన్నాను.

ఆరోజు అప్పుడే మంగళవారం అయిపోయింది. పత్రికలో అచ్చుకావటానికి కనీసం శుక్రవారం సాయంత్రానికైనా కథ అతనిచేతుల్లోవుండాలి. అంటే మధ్యలో వున్నది మూడురోజుల వ్యవధి మాత్రమే. ఈలోగా ఒకసారివ్రాసి, తప్పొప్పులు సరిచూచి తిరగవ్రాసి యివ్వాలి. సాధ్యమవుతుందా అన్నప్రశ్న ఉదయించిందిగాని, ఏరోజొకటి నాలు కాగితాలు గిలికి యివ్వలేకపోతామా అన్నధీమా.

పదిరోజులు శెలవులు వచ్చినయ్యి కాబట్టి కాలేజికి వెళ్ళవలసిన అవసరం లేదు. అయినా ప్రతిసాయంత్రం క్లబ్బుకువెళ్ళి కాలక్షేపం చెయ్యడం అలవాటు. ఆరోజు క్లబ్బుకువెళ్ళి కొంచెం ఆలస్యంగా యిల్లు చేరుకున్నాను. పదిగంటలకు రెండుమెతుకులు నోట్లోవేసుకుని గదిలోబల్లముందుకూర్చున్నా కాగితం, కలం ముందువేసుకుని కథవ్రాద్దామని.

కథావస్తువు ఏమిటా, ఏమివ్రాద్దామా అని తలపంకించి ఆలోచిస్తూ కూర్చున్నాను. ఏవేవో సన్నివేశాలు ఒకటివెంట మరొకటి బుర్రలో మెరిసినయ్యి. కాని ఒక్కటీ నచ్చలేదు. అప్పటికి పదకొండుగంటలు దాటింది. ఇంతలో చటుక్కున ఒక మంచిసన్నివేశం తళుక్కున మెరిసింది. వ్రాయడానికి పూనుకున్నా.

'గృహప్రవేశానికి రమ్మని అన్నయ్య జాబువ్రాశాడు. భార్యను తీసుకొని బెజవాడ బయలుదేరాడు. సికింద్రాబాదు స్టేషనులో...' ఉపక్రమించి వ్రాస్తున్నాను. "అదేమిటండీ, అర్ధరాత్రప్పుడు నిద్రచెడగొట్టుకొని వ్రాస్తూ కూర్చోకపోతే, ఉదయం వ్రాసుకోరాదూ, శెలవులేగా" అంటూ మా ఆవిడ గదిలోప్రవేశిస్తూ అన్నది, అప్పుడే యిల్లుసర్దుకు వచ్చి.

కథానిక వ్రాసి యివ్వడానికి రెండు రోజులే వ్యవధివుందని అన్నప్పుడల్లా ఆలోచనలు రావని, వచ్చినప్పుడే అర్ధరాత్రయినా సరే వ్రాసుకోవాలిసిందేననీ ఒక చిన్న ఉపన్యాసం యిచ్చాను.

సంతోషించినట్లేవుంది, పడుకోండి, రేపు వ్రాసుకోవచ్చుఅంటూ, స్విచ్ నొక్కి దీపం తీసేసి పడుకుంది. ఏమిటే అఘాయిత్యం అని విసుక్కుంటూ లేచివెళ్ళి మళ్ళీ లైటువేసుకుని వ్రాయడానికి ఉపక్రమించాను.

ఆలోచనలకు అంతరాయం కలిగిందేమో, మరల వెంటనే వ్రాత కొనసాగించలేకపోయాను. పైగా నిద్ర ముంచుకొచ్చింది. సరే రేపు వ్రాసుకోవచ్చునని దీపం తీసివేసి పడుకున్నాను.

ఉదయం స్నానాదికాలు ముగించి ఏడు గంటలకల్లా గదిలో బల్లముందు కూర్చున్నా కథానికను పూర్తిచేద్దామని.

'సత్యం వున్నాడా' అంటూ లోపలికి వచ్చాడు నాయుడు. దూరదేశంలో ఉద్యోగం చేస్తున్నాడేమో ఈ మధ్య మేము కలుసుకొని సంవత్సరం పైగా

## గోవాడ సత్యారావు

అయింది. ఇద్దరికీ ఉత్తరాలు వ్రాయడమంటే వళ్లు బద్ధకం. వాడికబురు తెలిసి కూడా మూడు నాలుగు నెలలయింది. మేమిద్దరం కలిసి చదువుకున్నాం పదేళ్లు. ఆ రోజుల్లో ఒకటిగా తిరిగేవాళ్లం. ఆ క్రితం రోజే వచ్చాడుట ఊరినుంచి. చూద్దామని వచ్చాడు ప్రొద్దున్నే.

వాడి మాట వినగానే కాగితం కలం అక్కడే వేసి ఒక్క గంతులో గదిలోనుంచి బయటకు వచ్చాను. నాయుడు వచ్చాడనటంతోటే వంటింట్లో పనులు ఆపి మా ఆవిడ కూడ వచ్చింది. పిచ్చాపాటి కొంతసేపు మాట్లాడుకున్నాం. మధ్యాహ్నం 11 గంటలకు భోజనాలు చేశాం. మూడు గంటలకు ఊరికి వెళ్లాలని, మళ్ళీ ఆదివారం వస్తానని చెప్పి నాయుడు వెళ్లిపోయాడు.

వాడిని పంపించి గదిలోకి వచ్చి కథానికను పూర్తిచేయడానికి ఉపక్రమించాను.

పనిమనిషి ఏదో పొరపాటు చేసిందేమో, దానిమీద మా ఆవిడ నోరుచేసుకుని అరుస్తున్నది. సంజాయిషీ యిచ్చినకొద్ది రెచ్చిపోయి యిష్టం వచ్చినట్లు తిడుతున్నది.

కథ పూర్తిచేసి యివ్వాలన్న ఆగుర్దా ఎక్కువైన కొద్దీ మా ఆవిడ అరుపులు భరించరానంత చిరాకు కెత్తించింది.

'అబ్బబ్బ, నన్ను వ్రాసుకోనీకుండా ఏమిటే ఒకటే గోల, అవతలికి పోరాదూ' అన్నాను విసుక్కుంటూ.

'అవునులెండి మీకు ఇది గోలగా వుంటుంది. అదిచేసిన తప్పు మీకు కనిపించదు'—అప్పుడే కోపం వచ్చింది—"ఇంత ఎందుకూ, నేను యిక్కడ వుంటే మీరు వ్రాసుకోలేక పోతున్నారుగా, నేను మా వాళ్ళయింటికి పోతున్నాను, మీరు కథ వ్రాసుకోండి, రాత్రికి తిరిగి వస్తాను లెండి" అంది. యాదాలాపంగా సరే వెళ్లు అన్నాను. మా ఆవిడ అసలే ముక్కోపి. మహా పట్టుదల మనిషి. వెంటనే పనిమనిషిని పంపి ఒక టాక్సీ పిలిపించుకొని దోమలగూడాలోవున్న వాళ్ల అక్కగారింటికి వెళ్లింది.

విసుగ్గా వుంది. మా ఆవిడకు కోపంవచ్చి వెళ్ళింది. ఏమిటో బుర్ర పనిచెయ్యలేదు. ఒక్క కునుకుతీసి తర్వాత వ్రాసుకుందామని నిద్రపోయాను. నాలుగు గంటలకు లేచి ముఖం కడుక్కొని కాఫీకొరకు బజారు వెళ్లి వచ్చాను.

తలుపుతీసి లోపలప్రవేశించుకుండగానే ఒకాయన వెనకనుంచి పిలిచాడు.

"సత్యనారాయణగారు మీరేనాండి,"

"అవును, మీ రెవరు?"

"సెక్రటేరియటులో ఉద్యోగం చేస్తున్నానులెండి."

"లోపలికి రండి".

"మాస్టారూ ఈ రోజుల్లో ఇలు దొరకటమంటే చాల కష్టంగా వుందండి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి కొన్నివేలమంది ఇక్కడికి వచ్చారేమో మరీ యిబ్బందిగా వుందండి."

"అవునండి" అన్నాను మర్యాదకోసం.

"అందుకనె బోర్డు చూడగానే మిగతా పనులు మానుకుని వెంటనే వచ్చేశాను. ఏ భాగముండీ, ఎన్నిగదులు, చూడవచ్చునా," నాకేం బోధపడలేదు.

"నాకేం తెలియదండీ, అయినా యిక్కడేం భాగాలు ఖాళీగా లేవు" అన్నాను.

"అదేమిటండీ భాగం ఖాళీగా వుందని బోర్డువేసి యిప్పుడు లేదంటారు, ఇంతలోనే మిగిలిపోయిందా ఏమండీ."

"ఏం బోర్డండి, నాకేం తెలియదే," ఆశ్చర్యపడుతూ అడిగాను.

"సెక్రటేరియటు గేటుకు తగిలించివుంది

...ర్డు. ఇక్కడ యిల్లు ఖాళీగావుందని, విన
...లు మిమ్మల్లను కనుక్కోవచ్చని." అని
...యన చెప్పేసరికి నాకు మతిపోయినంత
...ని అయింది.

ఎవరో నా విరోధులు ఈపని చేసివుంటారని, నిజంగా ఏమీ అద్దెకిచ్చే భాగాలు లేవని నచ్చజెప్పి ఆయనను పంపించేటప్పటికి నా తలప్రాణం తోకకు వచ్చింది.

ఎవరు చేసివుంటారా అని ఆలోచిస్తూ వుండిపోయాను. తర్వాత మరల కథను వ్రాద్దామని మొదలుపెట్టాను.

ఇంతలో ఎవరో తలుపుకొట్టారు.

"సత్యనారాయణగారు మీరేనా" తలుపు తియ్యగానే ప్రశ్నించారు. వీరుకూడా యింటికోసమే వచ్చారట.

"అసెంబ్లీముందు వుంటే యీ అట్టను పట్టుకువచ్చాను. లేకపోతే ఇంకా చాలమంది పోటీకి రాగలరు. ఇళ్ళు దొరకటం కష్టంగా వుంది కనుక, క్షమించాలి."

"ఈ బోర్డు వేసినవా రెవరోగాని మీకూ శ్రమ కలిగించారు. నాకూ శ్రమ కలిగించారు. ఈ బోర్డు విషయం నాకు తెలియదు, నేను వేయలేదు, ఇక్కడ యిళ్ళు ఖాళీగాలేవు" అని చెప్పేసరికి అయన నిర్ఘాంతపోయారు. ఆశపడి వచ్చినందుకు మోసం జరిగిందేమిటా అనుకుంటూ వెళ్ళిపోయారు.

ఇక యింట్లోవుంటే లాభం లేదనుకుని బట్టలు వేసుకుని క్లబ్బుకు వెళ్ళాను.

మామూలుగా యింటికి తిరిగి వచ్చేవేళకి మా ఆవిడ తిరిగి వచ్చింది.

భోజనం చేస్తున్నప్పుడు అడిగింది మా ఆవిడ, కథ పూర్తయిందా అని. వ్రాయడానికి వీలుపడలేదని సాయంత్రం ఇంటిదగ్గిర జరిగిన విచిత్రం ఆవిడతో చెప్పాను. ఇంతటి అఘాయిత్యానికి ఎవరు పూనుకొని వుంటారా అని అన్నాను.

ఫక్కునవవ్వి, తనే చేసినట్లు చెప్పింది మా ఆవిడ విజయగర్వంతో. "నేను యింట్లో లేకపోతే మీరు కథ పూర్తిచేసుకుంటానన్నారుగా ఎలాచేసుకుంటారో చూద్దామని, మా రాముడు కిచ్చి పంపించి ఈఅట్టలు కట్టించాను." అంది.

"ఇప్పటికి ఓడిపోయినట్లేలే" ఓటమిని అంగీకరించాను "అనువుగానివేళ అధికులమన రాదు." కనుక భోజనాలయినయ్యి, కథ ప్రసక్తి లేకుండానే నిద్రపోయాను.

మరునాడు ఉదయమే కాఫీ సేవించి, బజారులో పనివున్నదని, బహుశః భోజనానికి రాకపోవచ్చునని చెప్పివెళ్ళాను. తాజ్‌మహాలు హోటలులో గట్టిగా పలహారంచేసి సరాసరి పబ్లిక్ గార్డెన్సుకి వెళ్ళాను. ఒకమూల కూర్చొని కథ వ్రాయడం ప్రారంభించాను.

"శీను, అతనిభార్య సికింద్రాబాదు స్టేషనులో..." అది అక్కడే ఆపివేశాను.

సాయంత్రానికి ఇంకో కొత్తకథ వ్రాసి తీసుకెళ్ళి సంపాదకునికి అందించాను.

ఇంట్లో మరల కథ ప్రసక్తి రాలేదు.

ఆదివారం ఉదయం పత్రికలకుర్రవాడు 'శారద'ను తెచ్చియిచ్చాడు. నేను గదిలో గడ్డం చేసుకుంటున్నాను. మా ఆవిడా పత్రికను తీసుకుని పేజీలు తిరగవేస్తూ నా పేరన కథచూచి ఆశ్చర్యపోయింది. పూర్తిగా కథ చదివి, పట్టరానంత కోపంతో గదిలోకి వచ్చింది ఒకచేత్తో పత్రిక పుచ్చుకొని.

"ఇదంతా వ్రాయమని ఎవరు చెప్పారు" గర్జించింది.

"ఏం కథ బాగాలేదా? బాగాలేదని సంపాదకునికి ఒకజాబు వ్రాయి. జన్మలో కథ వ్రాయమని నన్ను అడగడు. నీకూ శ్రమ తప్పుతుంది. నాకూ శ్రమ తప్పుతుంది. ఊళ్లో వాళ్లు అనవసరంగా యిక్కడికి రాకుండా తప్పుతుంది." అన్నాను కొంటెగా.

"ఎన్నిఏళ్లువచ్చినా కుర్రతనపు చిలిపి చేష్టలుమాత్రం పోవు. మీకే పంతం తగ్గించుకున్నారులెండి." ★

(16-వ పేజీ తరువాయి)

తాపీగా ఆలోచించండి" అన్నాడు రామనాథంగారు లాలనగా.

సుబ్బారావుగారు ప్రసన్నుడయ్యాడు. "అహా అసలు చెబుగురూ" అన్నాడు.

రామనాథంగారు చిన్న పొడిదగ్గు దగ్గి ఉపక్రమించారు.

"మంత్రి కాబోయేముందు మంచిపని చెయ్యాలన్నారు. మా అబ్బాయి మీ పిల్లని చేసుకుంటానని పట్టుబట్టి ఇంకెన్ని సంబంధాలొచ్చినా తిరగ్గొడుతున్నాడు. మీ సీతమ్మకీ ఇష్టమేట. ఇక మా మాటఅంటారా చెప్పేదేముంది. మీవంటివారితో వియ్యం... మరి మీరుశాంతము చెయ్యడమే తరువాయి" అన్నారు తాపీగా.

సుబ్బారావుగారు చుట్టూ పరకాయించి చూశారు. గదిగుమ్మానికి చేరబడి రామనాథంగారి భార్య నిల్చుంది.

"అవు నన్నగారూ ఊఁ అనండి" అందామె.

సీత వెనకాల నించుంది తనవేపే చూస్తూ. కొంచెం అసింటా తుకారాం నిలబడి ఆతృతగా చూస్తున్నాడు.

సుబ్బారావుగారు గంభీరంగా మొహం పెట్టి ఆలోచించారు. చుట్టూ పరకాయించారు.

"అప్లికెంట్ ఏడి?" అన్నారు.

"అబ్బాయ్ ఇలారా" అని రామనాథంగారు కేకేశారు.

గురునాథం వచ్చాడు మెల్లిగా.

"ఏవోయ్ మాపిల్లని చేసుకోవాలనుకుంటున్నావా?" అన్నారు సుబ్బారావుగారు.

"మరేండి" అన్నాడు గురునాథం మెల్లిగా.

"ఏమే సీతా నచ్చాడా?"

సీత నవ్వింది; ప్రేమించినవాడిని పెళ్లాడబోయే పిల్లలా.

"శుభం. శాంతుసైపోయింది పెళ్ళి ముహూర్తం పెట్టించండి బావగారూ" అన్నారు సుబ్బారావుగారు.

అందరి మొహాలూ వికసించాయి ఆనందంతో.

హీరో గురునాథరావు ముఖారవిందం మాత్రం కొస్త తటపటాయిస్తోంది.

"ఏమిట్రా" అన్నారు రామనాథంగారు.

"గు...గుండు...కొ...కొంచెం ఆగి ము...ముహూర్తం" అన్నాడు గురునాథం గుటకలు మింగుతూ.

"హారినీ...గుండు గురించి కూడా బెంగే?...వెశ్వక్రాపింగు ఇట్టే పెరుగుతుంది భయపడకు. మీ నాన్నజీతం అనుకున్నావేమిటి, ఒకంతటా పెరక్కపోడానికి?" అన్నారు సుబ్బారావుగారు ఫెళఫెళ నవ్వుతూ.

"—లేపోతే నీ మావగారి అదృష్టం అనుకున్నావా" అని రామనాథంగారు అందుకోబోయారుగాని, కోలేదు; తమాయించుకున్నారు.

* * *

పెళ్ళి మర్నాడురాత్రి గురునాథరావు సీతకి తనడైరీ వినిపించి తనుపడ్డ వేదన వివరించాడు.

"సీతా నీకోసం ఎన్ని సంబంధాలొదిలేశానో చూశావా; మీ నాన్నగారు మంత్రిపదవికోసం ఉద్యోగాలూ ప్రాక్టీసూ వదిలేసినట్టు. ఎటొచ్చి నేను సాధించాను. ఆయన ఇంకా లేదు. సాధిస్తారనుకో."

"ఈముక్క నాదగ్గిరంటే అన్నారుగాని మానాన్నదగ్గి రన్నారంటే జాగర్త. ఆయన సుభ్భరంగా ప్రాక్టీసు చేద్దామని నిశ్చయించుకొన్నారు" అంది సీత నవ్వుతూ.

* * *

"పది" అంది గదిలో గడియారం.

"మరేస్మీ" అంది సుబ్బారావుగారింటి గడియారం ప్రతిధ్వని... ★